నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
12 | మంగళవారం 4 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అంజనీపుత్ర చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి

'అంజనీపుత్ర'కు వండర్ బుక్ ఆఫ్ రికార్డు

- 4 లక్షల శ్రీగంధం చెట్లు నాటినందుకు పురస్కారం
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా కో-ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్

మంచిర్యాల అర్బన్, మార్చి 3: అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా సోమవారం మంచిర్యాలలోని ఎన్‌వీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ చేతుల మీదుగా అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, చైర్మన్ గుర్రాల శ్రీధర్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఏడేళ్లుగా కాలుష్యాన్ని నిర్మూలించాలన్న సంకల్పంతో పురుడు పోసుకున్న అంజనీపుత్ర ఎస్టేట్స్ దినదినం శ్రీగంధం చెట్ల పెంపకంలో ఎప్పటికప్పుడు ఒక ప్రత్యేకతను చాటుకుంటున్నదన్నారు. 2017 సంవత్సరంలో అంజనీపుత్ర ఎస్టేట్స్ వ్యవస్థాపకుడు గుర్రాల శ్రీధర్ నేతృత్వంలో ప్రారంభమైనట్లు వారి ఆధ్వర్యంలో 350 ఎకరాల్లో 4 లక్షల శ్రీ గంధం చెట్లు నాటి ఎందరికో స్ఫూర్తిగా నిలిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అంజనీపుత్ర సంస్థకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి, కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలంగాణ ప్రతినిధులు అరుణ్ కుమార్, తగరపు శంకర్ పాల్గొన్నారు.

దర్జాగా పార్కు స్థలం కబ్జా

మంచిర్యాలలోని బైపాస్‌రోడ్డులో మున్సిపల్ స్థలంలో ప్రహరీ

పార్కు స్థలంలో ప్రహరీ నిర్మించిన కబ్జాదారులు

మంచిర్యాలటౌన్, మార్చి 3 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని రెడ్డికాలనీలో ఉన్న బైపాస్‌రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేశారు. సర్వే నంబర్ 194లో దాదాపు 400 చదరపు గజాల స్థలాన్ని 25 ఏళ్ల కిందట రెడ్డికాలనీ లేఅవుట్ చేసిన సందర్భంలో మున్సిపాలిటీకి పార్కు స్థలం కోసం కేటాయించారు. దీని చుట్టూ ఎలాంటి ప్రహరీ కానీ, కంచె గానీ లేక పోవడంతో కబ్జారాయుళ్ల కళ్లు దీనిపై పడింది. దర్జాగా పార్కు స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించారు. మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారడం, బైపాస్‌రోడ్డులో భూముల ధరలు అమాంతంగా పెరిగిపోయిన నేపథ్యంలో కబ్జారాయుళ్లు ఈ దురాగతానికి ఒడిగట్టారు. బైపాస్ రోడ్డులో ఎన్ఆర్‌సీపీ ప్లాంటుకు సమీపంలో ఉన్న ఈ భూమి విలువ కోట్లలో పలుకుతున్నది. మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారడం, అధికారులు ఇతర పనుల్లో నిమగ్నమై ఉండడం, ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పనుల్లో వారు రోజుల తరబడి బిజీగా ఉండడం కబ్జాదారులకు కలిసొచ్చింది. దీంతో ఏకంగా పార్కు స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించారు. పైగా ఈ స్థలాన్ని వ్యాపారులకు లీజుకు ఇచ్చేందుకు కూడా సిద్ధమయ్యారు. కాగా ఈ విషయంలో కార్పొరేషన్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విషయం తెలిసినప్పటికీ కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ప్రచారం జరుగుతున్నది. ఈ విషయమై కమిషనర్, టీపీవోల వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు.

కోర్టుకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

కోర్టు వద్ద కోటపల్లి మండల నాయకులు

కోటపల్లి, మార్చి 3 : ఏక కాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వెంటనే రైతు భరోసాను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కోటపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగగా వీరి పైన కేసు నమోదు కావడంతో చెన్నూర్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో హాజరయ్యారు. 2024 అక్టోబర్ 20న కోటపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేశారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణ మాఫీ, ప్రతి రైతుకూ రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.7500 చొప్పున అందజేయాలని నిరసన వ్యక్తం చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ కేసు విషయంలో పీఏసీఎస్ కోటపల్లి మండల అధ్యక్షుడు పెద్దపోలు సాంబాగౌడ్, బీఆర్ఎస్ మండల నాయకులు కొట్టె నారాయణ, కంకణాల సంపత్ రెడ్డి, కల్వకుంట్ల తిరుపతి, ఆసంపల్లి సంపత్ కోర్టులో హాజరయ్యారు. రైతుల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

గోదావరి నుంచి తెప్పపై తీసుకువచ్చిన ఇసుక

తోడేస్తున్నారు

గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలింపు

- ఆదాయాన్ని కోల్పోతున్న రెవెన్యూ శాఖ
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు

దండేపల్లి, మార్చి 3 : దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా రెవెన్యూ, భూగర్భ గనుల శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హాజీపూర్ మండలం గుడిపేట్ వద్ద గోదావరి నదిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిని నిల్వ ఉంచడంతో, ప్రాజెక్టులోని బ్యాక్ వాటర్ హాజీపూర్ మండలం నుంచి దండేపల్లి మండలం వెల్గనూర్ వరకు నిల్వ ఉంది. దీంతో లక్షెట్టిపేట మండలంలో, గూడెం గోదావరి తీరంలో ఇసుక తీసేందుకు వీలు లేకుండా పోయింది. ప్రస్తుతం అక్రమార్కులు గోదావరి నీరు నిల్వ లేని, ఇసుక తరలింపునకు అనువుగా ఉన్న దండేపల్లి మండలంలోని గుడిరేవు తీరం నుంచి ఇసుకను తరలిస్తున్నారు.

నదిలో ఇసుకను తవ్వి..తెప్పలపై తెస్తూ..

దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి నది తీరానికి అవతలి వైపున జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని జైనా, రాజారాం తీరాలున్నాయి. రెండు వైపులా నుంచి ఇసుక ట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో వస్తున్నాయి. దీంతో నది తీరంలో ఎటు చూసినా ఇసుక ట్రాక్టర్లలో ఇసుక నింపే దృశ్యాలు కనిపిస్తున్నాయి. గోదావరిలో కొద్దిపాటి నీరున్న చోట, నది మధ్యలో ఇసుక మేటల నుంచి ఇసుకను తోడుతూ తెప్పల మీద తీసుకొస్తూ ఒడ్డున పోస్తున్నారు. ఆ తర్వాత ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను తరలిస్తూ లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుకను కొన్ని ప్రాంతాల్లో డంప్ చేస్తూ రాత్రి పూట గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇసుక తరలింపుతో గోదావరిలో పెద్ద గుంతలు ఏర్పడి భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఒక్కో ఇసుక ట్రిప్పునకు రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు దంచి వసూలు చేస్తుండడం గమనార్హం. ఇదంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు మిన్నకుండిపోవడం వెనుక మతలబు ఏమిటో అర్థం కావడం లేదని స్థానికులు మండిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో వ్యవసాయ భూములు, బోర్లలో భూగర్భ జలాల మట్టం పూర్తిగా పడిపోతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

గుడిరేవు తీరంలో ఇసుక డంపులు



సోన్ మండలంలోని వెంగ్వాపేట్‌లో నీరు లేక ఎండిన వరిపైరు

చివరికి కన్నీరు

- స్వర్ణ వాగు పరిధిలోని రైతులు ఆందోళన
- నీటిని పెద్ద మొత్తంలో విడుదల చేసి ఆదుకోవాలని వేడుకోలు

ఎడారిని తలపిస్తున్న స్వర్ణ వాగు

సోన్, మార్చి 3 : స్వర్ణ ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువలతోపాటు జౌలినాలా కూడా ఉంటుంది. నీరు అధికం అయినప్పుడు జౌలినాలా ద్వారా నీటిని దిగువనకు వదులుతారు. దీని పరిధిలో నిర్మల్, దిలావర్‌పూర్ మండలాల్లోని వెంగ్వాపేట్, కాల్వ, కాల్వ తాండ, తల్వేద, చిట్యాల్ గ్రామ రైతులు ఈ యాసంగిలో వరిని సాగు చేశారు. దాదాపు 400 మంది రైతులు 1600 ఎకరాలు సాగు చేస్తున్నారు. స్వర్ణ ఎడారిని తలపిస్తుండడంతో నీరందక దిగుబడి తగ్గే అవకాశం ఉంది. డిసెంబర్‌లో నాట్లు వేయగా.. మరో నెల రోజుల్లో పూత, ఈనే దశకు రానుండడంతో నీరు తప్పనిసరిగా అందించాల్సి ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును కలిసి రైతులు నీటిని వదిలించాలని విన్నవించారు. వీరు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని విడిపించినా రెండు, మూడు రోజులైనా నీటిధార చివరి వరకు రావడం లేదు. ఇప్పుడే నీరు రాకుంటే.. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ఇంకా ఇబ్బంది అవుతుందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. పంటలు ఎండి దిగుబడి తగ్గితే నష్టాల పాలవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగుతోపాటు మూగ జీవాల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. తాగుతామంటే నీరు కూడా లేని దుస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటిని అధిక మొత్తంలో జౌలినాలా ద్వారా విడుదల చేసి కాపాడాలని కోరుతున్నారు.

నీటిధార బంధైంది..

నాకున్న ఆరెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశా. ప్రస్తుతం పంట బాగున్నప్పటికీ వాగులో నీరు లేక.. ఉన్న మోటరును గుంత తవ్వి నీటిలో దించాల్సి వస్తున్నది. అయితే పైనుంచి నీటిధార రాకపోవడంతో పంట చేతికొస్తుందో లేదోనని భయంగా ఉంది. ఇప్పటికే ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించగా నీటిని విడుదల చేయించారు. ప్రస్తుతం వాగులో నీరు పూర్తిగా ఎండిపోయింది. పరిస్థితిని అర్థం చేసుకుని నాయకులు, అధికారులు నీటిని విడుదల చేస్తే తమ పంటకు ఢోకా ఉండదు.

- కొప్పుల రాజు, రైతు, వెంగ్వాపేట్.

దళిత బంధుకు మంగళం !

- అయోమయంలో దరఖాస్తు దారులు
- పెండింగ్‌లో వెయ్యికిపైగా అర్జీలు

ఏడాదైనా ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళిత బంధు అమలుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ పథకానికి మంగళం పాడినట్లేనని తెలుస్తున్నది. దళితుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన దళిత బంధు పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా దళిత బంధు పథకం అమలుపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంతో ఈ పథకం అమలుపై అనుమానాలు కలుగుతున్నాయి. ఈ పథకం ద్వారా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున ఈ పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం విజయవంతమవడంతో నియోజకవర్గానికి 500 మందికి చొప్పున అందించాలని సంకల్పించింది. ఇందుకు దరఖాస్తులను కూడా స్వీకరించారు. ఈ దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అయితే గత ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పథకాన్ని నిలిపివేశారు. ప్రస్తుతం ఈ పథకం ఉంటుందో లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో వివక్షకు గురవుతూ అభివృద్ధి, ఆర్థిక స్థితిగతిలో వెనుకబడి ఉన్న దళితులను వ్యాపార వేత్తలు, వివిధ రకాల వాహనాలకు యజమానులుగా, వారు సొంతంగా ఆర్థికంగా ఎదిగేలా గత కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా దళిత బంధు పథకాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో 100 మంది చొప్పున మొత్తం 200 మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున రూ.20 కోట్లు అందించింది. ఈ డబ్బులతో దళితులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో వ్యాపారాలు, వివిధ స్వయం ఉపాధి రంగాల్లో పెట్టుబడి పెట్టి ఆర్థిక అభివృద్ధి సాధించారు. దళిత బంధు పథకం విజయవంతం కావడంతో ఈ పథకాన్ని మరింత విస్తరించి దళితుల అభివృద్ధి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసేందుకు సంకల్పించింది. ప్రతి నియోజకవర్గానికీ 500 మంది దళితులకు ఈ పథకాన్ని అమలు చేయాలని భావించింది. దీనికోసం దళితుల నుంచి అర్జీలను స్వీకరించింది. ఎలాంటి పక్షపాతం లేకుండా అప్పటి ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అర్జీలను స్వీకరించి నియోజకవర్గానికి 500 మందిని ఎంపిక చేసింది. ఈ జాబితా అధికారుల వద్దనే పెండింగ్‌లో ఉన్నది. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పథకం అమలులో జాప్యం జరిగింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు పథకం అమలుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొన్నది. అసలు దళిత బంధు పథకం అమలు జరుగుతుందా ? లేదా ? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని దళితులు కోరుతున్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో దళిత బంధు ద్వారా షాప్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుడు రవీందర్

కేసీఆర్ ప్రభుత్వంలో దళిత బంధు ద్వారా ఫ్లెక్సీ ప్రింట్ షాప్ ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుడు శ్రీకాంత్ రెబ్బెన మండలం (ఫైల్)